క్లుప్తంగా

ముగిసిన శిక్షణ కార్యక్రమం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న సొంత ఆదాయ వనరుల గురించి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి మాట్లాడుతూ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, దోమ ఉదయ భాస్కర్‌లు చెప్పిన అంశాలను అందరూ పాటించాలని కోరారు. గ్రామాలకు వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకుని పంచాయతీలకు ఆదాయం వచ్చే పనులను చేయాలని అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



భట్టిప్రోలు: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, బాలవికాస్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ నెల 3వ తేదీన వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వృత్తి అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారికి శనివారం నిర్వాహకులు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఆర్గనైజేషన్ బాలవికాస్ సేవాదళ్ నిర్వాహకులు తూనుగుంట్ల శ్రీధర్, మానేపల్లి సుబ్బారావు, దివి రామకృష్ణ, బాలవికాస్ గురువులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీలకు సొంత ఆదాయం ముఖ్యం



చుండూరు(వేమూరు): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయం కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సొంత ఆదాయంపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు ఈ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మేజరు పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు పూర్తి స్థాయిలో ఉంటాయని, వాటిని గ్రామ పంచాయతీ గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుపదీ, డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపుపై అవగాహన



చుండూరు(వేమూరు): పచ్చదనం పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించామని ఎంపీడీవో సుదీప తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనిపై గ్రామంలో ర్యాలీ జరిగింది. మహిళలకు ప్లాంటేషన్, టెర్రస్ గార్డెనింగ్పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి ముఖ్యం

చెరుకుపల్లి: గ్రామ పంచాయతీలలో సొంత ఆదాయ వనరులను పెంచుకుంటేనే త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ ఎంపీడీవో కేజీఏ శ్రీనివాసన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ రెండవ రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు కూడా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పన్నులు వసూలు చేయాలన్నారు. అక్రమ లేఅవుట్‌లు వేసిన వారిపైనా దృష్టి పెట్టాలని కోరారు. ప్రకటనల బోర్డులపై కూడా దృష్టి సారించాలని కోరారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి మండలంలోని ఏ ఒక్క గ్రామ సర్పంచ్ కూడా హాజరు కాలేదు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పి.పద్మ , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య సేవలు అస్తవ్యస్తం

- సమయపాలనలో వైద్యులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం
- పర్యవేక్షణ లోపంతో రోగులకు అందని వైద్యసేవలు


శనివారం మధ్యాహ్నం వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కొల్లూరు: పేద వర్గాలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన పీహెచ్‌సీలలో వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయి. కొల్లూరు పీహెచ్‌సీలో పర్యవేక్షణా లోపం కారణంగా అనారోగ్యాలు, జ్వరాలతో వైద్యశాలకు వచ్చే రోగులను పరీక్షించడానికి వైద్యులు అందుబాటులో లేకుండా పోతున్నారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడాన్ని అలుసుగా తీసుకున్న స్టాఫ్ నర్స్‌లు సైతం నిర్ణీత సమయానికి విధులకు హాజరవకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యం అందని ద్రాక్షలా మారుతుంది. పీహెచ్‌సీలో విధులు నిర్వహించడానికి ముగ్గురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఇరువురు వైద్యులు శిబిరాలకు వెళుతుండటంతో మూడో వైద్యురాలు ఎక్కువగా ఇంటికే పరిమితం అయ్యారు. వచ్చి రెండు, మూడు గంటలు ఉండి వెళ్లిపోతుండటంతో తప్పనిసరి పరిస్థితులలో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారు మందులు తీసుకొని వెనుతిరుగుతున్నారు. సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జ్వర పీడితులు ప్రయివేటు వైద్యశాలల దారిపడుతున్నారు. పీహెచ్‌సీలో విధులకు రాని వైద్యులు రోజు విడిచి రోజు వచ్చినా హాజరు పట్టికను మాత్రం నింపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

భట్టిప్రోలు/ పెదపులివర్రు / వెల్లటూరు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో సోమవారం నుంచి శ్రీవరదరాజస్వామి, శ్రీరాజరాజ నరేంద్రస్వామి, గ్రామ దేవత శ్రీగోగులమ్మ దేవాలయాలలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వెల్లటూరు గ్రామంలో శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ అగస్తేశ్వరస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి, భట్టిప్రోలులోని శ్రీ రుక్మిణి శ్రీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ విశలేశ్వరస్వామి దేవాలయాలలో కూడా దసరా మహోత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ వారి దేవస్థానంలో వేడుకలు ఉంటాయని కట్లమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వెల్లటూరు లాక్ సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో దసరా మహోత్సవాలు ఉంటాయని జొన్నా సుబ్బారావు భవాని తెలిపారు. భట్టిప్రోలులోని శ్రీ షిర్డీ సాయిబాబా వారి 107వ ఆరాధనోత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉదయం, రాత్రి బతుకమ్మ పూజలు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. భట్టిప్రోలులోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవాలయంలో కూడా దసరా మహోత్సవాల ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.


శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవార్లు

‘స్వర్ణాంధ్ర - సచ్ఛాంధ్ర’పై ప్రతిజ్ఞ


పెదపూడి గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్క నాటిన ఎంపీడీవో రవికుమార్

వేమూరు / అమర్తలూరు: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రతి గ్రామం శుభ్రం చేసుకోవాలని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట లక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో శేషాంబ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కీలకం

మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో పి.రవి కుమార్ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మహిళలకు టెర్రస్, హోం గార్డెనింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మొక్కలు నాటారు. అందరూ ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ, తహసీల్దారు బి.సుశీల, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి , షేక్ హనీఫ్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లూరు: కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ఉన్నాయని, ఆ నాలుగింటిని తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. శనివారం కొల్లూరు ప్రజాసంఘాల భవనంలో గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగుల పని గంటలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని విమర్శించారు. గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో 551 ప్రకారం పారిశుద్ధ్య కార్మికుల విషయంపై ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఈ నెల 27న రేపల్లెలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా బొనిగల సుబ్బారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా చొప్పర సురేష్, కంచర్ల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసరావులతో కూడిన 17 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొనిగల అగస్టీన్, బొనిగల సుబ్బారావు, పి.జ్యోతి, చొప్పర చెంచయ్య పాల్గొన్నారు.

‘మాండూక్యోపనిషత్’ గ్రంథానికి పల్లకీ ఉత్సవం


బుర్రిపాలెంలో పల్లకీ ఊరేగింపు

బుర్రిపాలెం(తెనాలి): మానవుడి పుట్టుక మూలంతో సహా సనాతన సంప్రదాయపు విశిష్టతను తెలియజేసే ఆధ్యాత్మిక గ్రంథం ‘మాండూక్యోపనిషత్’కు రూరల్ మండల గ్రామం బుర్రిపాలెంలో పల్లకీలో ఊరేగించి పట్టాభిషేకం చేశారు. గ్రామస్తుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ‘ట్రూత్ వివేకామృతం’ అధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు వివేకానంద వివిధ వేదాలు, ఉపనిషత్‌ల సారాన్ని గ్రహించి మండూక్యోపనిషత్ అనే గ్రంథాన్ని రచించారు. ఇది జ్ఞానాన్ని తెలియజేసే గ్రంథరాజంగా భావించి ప్రతిఒక్కరికీ చేరాలన్న ఉద్దేశంతో తొలిగా బుర్రిపాలెంలో పల్లకీ మహోత్సవం చేశారు. గ్రామానికి చెందిన శాఖమూరి వెంకటేశ్వరరావు–హేమలత కుమారుడు గోపీకృష్ణ–సాగరిక దంపతులు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని పండగలా చేశారు. అందంగా అలంకరించిన పల్లకీలో మాండూక్యోపనిషత్ గ్రంథాన్ని ఉంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు జరిపారు. మానవుడిని మాధవుడిని చేసే ఈ గ్రంథరాజాన్ని మానవాళికి ప్రసాదించినందుకు మహర్షులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మార్గమధ్యంలో ప్రతి దేవాలయంలోనూ పట్టువస్త్రాలు, గ్రంథంతో కూడిన సారెను సమర్పించారు. చివరగా మేళతాళాలతో ప్రతి ఇంటికీ వెళ్లి గ్రంథాన్ని అందజేశారు.

నేడు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

చుండూరు(వేమూరు): మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో సుదీప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు.వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ కీలకం


వ్యవసాయ కళాశాలలో పరిశుభ్రతా పనులు చేపట్టిన విద్యార్థులు

బాపట్ల: పచ్చదనం పెంపు, పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం కింద శనివారం ‘స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర’ కార్యక్రమాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. 5 ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు, యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. క్యాంపస్ పరిసరాలను శుభ్రం చేశారు. ప్రోగ్రాం అధికారులు డా. ఎం.రమాదేవి (విస్తరణ విభాగం), డా.సి.సంధ్యారాణి (కీటకశాస్త్ర విభాగం), డా.ఎస్‌కే అబ్దుల్ సలాం (పంట తెగుళ్ల శాస్త్రం విభాగం), డా. బి.రవీంద్ర రెడ్డి (స్టాటిస్టిక్స్ విభాగం), డా.జి.విజయ్ కుమార్ (ఫిజియోలాజి విభాగం) పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జీఎన్‌పాలెం (కర్లపాలెం): పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు, గర్భకోశ వ్యాధులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు చెప్పారు. పిట్టలవానిపాలెం మండలంలోని గోకరాజు నల్లిబోయిన వారిపాలెంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా అమలు జరుగుతున్న సబ్సిడీ పథకాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పశు యజమానులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ చేబ్రోలు ఇన్‌చార్జి చలపతిరావు, బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్, పశువైద్యులు జి.శివకుమారి, కె.తిరుమలతేజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ యారం వనజ

కర్లపాలెం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో యారం వనజ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి, అవగాహన కార్యక్రమాలకు తప్పనిసరిగా ఎంపీటీసీలను, సర్పంచ్‌లను పిలవాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. పంచాయతీలలో కొళాయిల ద్వారా అందించే నీరు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. వర్షం నీరు నిలిచినచోట బ్లీచింగ్, సున్నం చల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, ఎంపీటీసీలు, పద్మావతి, కమల, నాగలక్ష్మి, నవనీతం, తాండ్ర సాంబశివరావు, ఆసిఫ్ అలీ, సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, సర్పంచ్‌లు దేవరకొండ అంకమ్మ, కాగిత కరుణకుమారి, భానుప్రసాద్, నాగాంజనేయరెడ్డి, శేషాద్రి, ఏడుకొండలు, అధికారులు తదితరులు ఉన్నారు.

మహిళ ఆరోగ్యం కుటుంబానికి కీలకం


ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద వైద్య శిబిరం కొనసాగుతున్న దృశ్యం

చెరుకుపల్లి: మహిళ ఆరోగ్యం కుటుంబానికి ఆలంబన అవుతుందని కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమద్ అన్నారు. శనివారం ఉప కేంద్రం వద్ద స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిచారు. మహిళలకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ సమద్ మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం కోసం పెద్దపీట వేస్తున్నాయన్నారు, గర్భిణులకు పోష్టికాహారం పంపిణీ, క్యాన్సర్ స్క్రీనింగులతో పలు అంశాలపై అవగాహన కలిగించారు. మరో వైద్యాధికారిణి సాలేహా జుబేదా మాట్లాడుతూ మహిళలు వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తర్వాత మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన మందులు అందజేశారు. సీహెచ్ఓ అరుణ వాణిశ్రీ ఏఎన్ఎంలు బొట్టు శ్యామల, బి.విజయకుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి


డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


గుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

రేపల్లె(చెరుకుపల్లి): విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచటం అలవాటు చేసుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి చంద్రకుమార్ సూచించారు. అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శనివారం రేపల్లె పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ నివాసాలతోపాటు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దాసు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీవో కేజీఏ శ్రీనివాసన్ అన్నారు. శనివారం కావూరు పీహెచ్‌సీ పరిధిలోని గుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప కేంద్రం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలమయమైన బాపట్ల

- పలు చోట్ల కుండ పోత వర్షం
- వీధుల్లో నిలిచిన వాననీరు


పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ వీధిలో వాననీరు

బాపట్ల టౌన్: బాపట్లలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణం జలమయమైంది. లోతట్టు ప్రాంతాల్లో వాననీరు నిలిచింది. రోడ్లు కాలువలను తలపించాయి. పట్టణంలోని పాతబస్టాండ్, సంజయ్‌గాంధీ కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, విజయలక్ష్మిపురం, ఇస్లాంపేట, మల్లికార్జున బృందావనం కాలనీ, దర్శి పెద్దమస్తాన్ నగర్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతం కాలువలను తలపించింది. మండలంలోని ముత్తాయపాలెం, పిన్నిబోయినవారిపాలెం, మద్దిబోయినవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, వెదుళ్ళపల్లి, మర్రిపూడి, పూండ్ల, ఈతేరు గ్రామాల్లోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. అధికారులు స్పందించి వర్షపు నీటిని బయటకు పంపించేలా చర్యలు చేపట్టాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.


జలమయమైన బాపట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం